

# భయం

కప్పగంతుల సత్యనారాయణ

డాక్టరు అంబాపతి యింకా రాలేదు.

శర్మా, మూర్తీ, రావూ, ముగ్గురూ అతనికోసం కనిపెట్టుకొని కూచున్నారు.

శర్మమాత్రం, తక్కిన ఇద్దరికంటె కొంచెం కళవళ పాటుపడుతూ వున్నట్టున్నాడు. మాటిమాటికీ తన చేతిగడియారం వంక చూస్తున్నాడు. మూర్తి తాపీగా చుట్ట కాలుస్తున్నాడు. రావు పత్రిక చదువుకుంటున్నాడు.

ఉన్నట్టుండి, ''మన యెత్తు సరిగ్గా కొనసాగకపోతే, కొంప మునిగిపోతుంది'' అన్నాడు శర్మ.

''మరేం భయంలేదు. చక్కగా కొనసాగుతుంది. కాని, నా భయమల్లా ఒక్కటే. చేతులారా మహాపాతకం చేస్తున్నామే అని!'' అన్నాడు మూర్తి. చుట్టకొననువున్న కొడిని క్రిందకు రాలుస్తూ, పేపరు చుట్టచుట్టి, బల్లమీద పడవేసి, ''మరేం పాపంలేదు. వాడు చేసిన వెధవపనికి, మనం చేసేది ఒక శిక్ష అవుతుంది కాని. మనకి పాపం యేమీ చుట్టుకోదు'' అన్నాడు రావు.

''అదిగో బూటు చప్పుడు వినపడుతోంది, వస్తున్నట్టున్నాడు'' అన్నాడు శర్మ.

మళ్లీ రావు పేపరు చేతిలోకి తీసుకున్నాడు. మూర్తి చుట్ట నోట్లో పెట్టాడు.

''హలో, ఆలస్యంగా వచ్చాను కాబోసు'' అంటూ, ముప్పయి సంవత్సరాల యువకుడు లోపలికి వచ్చాడు.

''ఏమీ ఆలస్యంలేదు. రండి'' అని ఆ యువకుణ్ణి ఆహ్వానించాడు శర్మ.

''డాక్టరుగారికి, ఈమధ్య బొత్తిగా తీరుబాటు వుండటంలేదు'' అంటూ, చుట్టను వరండాలోనికి విసిరివేశాడు మూర్తి.

''ఎలావుంటుంది, ఆంజనేయులు చనిపోయినప్పటినుంచీ, ఆ ప్రాక్టీసుకూడా వీరిదే అయింది. బొత్తిగా వూపిరిసలపని ప్రాక్టీసు అయింది'' అంటూ, పేపరు మళ్ళీ మడిచి, ఓ మూలకి విసిరివేశాడు రావు.

''ఊపిరిసలపని ప్రాక్టీసు వున్నమాట వాస్తవమే కాని, దానికి తగినంత డబ్బు

రాదండీ. తగినంత డబ్బుకూడా వుంటే, శ్రమపడుతున్నామని అనుకోనక్కర లేదు" అని, మందహాసంతో జవాబు చెప్పాడు డాక్టరు.

మూర్తీ, రావూ ఒకరి మొఖ మొకరు చూసుకున్నారు.

"నేను కాఫీ తీసుకువస్తాను" అని శర్మ లోపలికి వెళ్లాడు.

డాక్టరు అందంగావుంటాడు. మంచి ఖరీదైన సూటువేసుకున్నాడు. అతని వంక దీక్షగా చూస్తున్నాడు మూర్తి.

రావు కొంచెంసేపు ఊరుకొని, "డాక్టరుగారూ, ఆత్మహత్యకు మంచి మార్గం ఏమిటండీ," అన్నాడు.

డాక్టరు వులికిపడి, "అలాటి ప్రశ్నకు, ఏం సమాధానంచెప్పమంటారు. అసలు ఆత్మహత్య కూడునా అనేదే పెద్ద మీమాంస'' అన్నాడు, చిరునవ్వు తెచ్చి పెట్టుకొని.

"జీవితం దుర్భటమైనప్పుడు, ఆత్మ హత్యచేసుకోక ఏం చేస్తాం? తప్పని సరి అయినప్పుడు, ప్రాణం తీసుకోవాలంటే, బాధలేనిమార్గం ఏమిటని ఆలోచన. డాక్టర్లు కదా మీరు తెలియకపోతుందా అని అడుగుతున్నాను" అన్నాడు రావు.

"రావుకి ఎప్పుడూ ఇలాటి దౌర్భాగ్యపు ఆలోచనలే పుడుతూవుంటాయి" అన్నాడు మూర్తి, నవ్వుతూ.

ఇంతలో శర్మ ఒకకప్పుతో కాఫీ తీసుకొనివచ్చి డాక్టరుముందు పెట్టారు.

"అదేమిటి, మీరందరూనో !" అని అడిగాడు డాక్టరు.

''మళ్లీ వెళ్ళి తేవాలి. రెండేసి కప్పులు ఒక్కసారె తెస్తే ఒలికిపోతుందేమోనని ఒక్కొక్కటే తెస్తున్నాను'' అంటూ, శర్మ మళ్లీ లోపలికి వెళ్ళాడు.


"మీరు తీసుకోండి'' అని, తన కప్పును రావుకు యివ్వబోయాడు డాక్టరు అంబాపతి.

"అబ్బే ! మీ కిచ్చింది మీరే తీసుకోవాలి. మాకూ వొస్తుందిగా !'' అన్నాడు రావు.

ఇంతలో ఒకపళ్లెంలో మూడుకప్పులు పెట్టుకుని "మా ఆవిడకు యిప్పుడు ఆలోచన తట్టింది. పళ్లెంలో మూడూ ఒక్కసారి పెట్టింది'' అంటూ శర్మ వచ్చాడు. రావు ఒక కప్పూ, మూర్తి ఒకకప్పూతీసుకున్నారు. ఒక కప్పు తనకోసం టేబిలు మీద పెట్టుకొని, పళ్లెం లోపలపెట్టి తిరిగివచ్చి తన కుర్చీలో కూచున్నాడు శర్మ.

"కానివ్వండి'' అంటూ తన కప్పును పెదవుల దగ్గరకు పోనిచ్చాడు రావు. అందరూ తమతమ కాఫీని త్రాగివేశారు. శర్మ తన గడియారంవంక చూశాడు. "ఇంకా పదినిమషాల వ్యవధివుంది. ఈ లోపల డాక్టరుగారితో మాట్లాడి వేద్దాము" అన్నాడు రావు.

"ఇంట్లోకి యెవ్వరినీ రానివ్వద్దని




చెప్పివస్తాను" అని శర్మ బైటికి వెళ్ళాడు.

"ఏమిటంత రహస్యం ?" అని కొంచెం అనుమానపడ్డాడు డాక్టరు అంబాపతి. ఇంతలో శర్మ మళ్లీ లోపలికివచ్చి వేశాడు.

"ఏమిటి సంగతి చెప్పండి" అన్నాడు, డాక్టరు అంబాపతి, శర్మవైపు తిరిగి.

"చిత్తం. డాక్టరుగారూ, ఇప్పుడు మేము మీకుచెప్పబోయేది చాలారహస్యం. అది మాకూ, మీకూ తప్ప మరెవరికీ తెలియదు. డాక్టరు ఆంజనేయులుకి నెల రోజులనాడు జబ్బుచేసింది. ఈవూళ్లో మీరుతప్ప మరొక డాక్టరు లేకపోవడం చేత, మిమ్మల్ని వైద్యానికి పిలిచాడు. మీరు వైద్యం ఆరంభించారు. అంత వరకూ బాగానేవుంది. ఆ తరువాయి కథే చాల అసహ్యంగానూ, దారుణంగానూ పరిణమించింది. అదిగో, మీ ముఖం నల్ల బడుతోంది. మీరు చేసిన పాపం మీకు తెలియదు కనుకనా ! కుర్చీలోనుంచి లేవ కండి. వీధితలుపులు తాళాలు వేయించాను. మీరు బయటికి వెళ్ళడానికి ఎంత మాత్రం వీలుదొరకదు. కూచోండి, ఆంజనేయులుగారి ఇంట్లో వైద్యం ప్రారంభించి మీరు చేసినపని ఏమిటంటే, వయసులోవున్న ఆయన భార్యను పాడు చెయ్యడం, ఆమెను మీ వలలో చిక్కించు కోవడం.—మీరేం మాట్లాడవద్దు. నన్ను

పూర్తిగా మాట్లాడనివ్వండి—మీరు పైకి చాలా అందంగా కనపడతారు. అంచేత ఆమె మీ వలలో పడిపోయింది. తరువాత, మీరేంచేశారంటే—ఆంజనేయులు భార్యనూ, అతని ప్రాక్టీసునూ శాశ్వతంగా మీచేత చిక్కించుకోవాలని చూశారు. దానికి ఒకటేమార్గం వుంది. అది ఆంజనేయులు చనిపోవడం. అంచేత, మందుఅనే పేరులో విషంపెట్టి అతన్ని క్రమంగా అంతమొందించేశారు. నిజంగా జబ్బులోవున్నాడు కనుక, మరణం ఎవరికీ అనుమానం కలిగించలేదు. మీరు దర్జాగా ప్రపంచంలో చెలామణీ అయిపోతున్నారు. కాని, మీరు చేసిన గొప్పపనిని రహస్యంగా దాచుకోక, ఆంజనేయులు భార్యదగ్గర గొప్పగా చెప్పుకున్నారు. మీ యిద్దరి మాటలూ, మరొకరువిన్నారు. అదిమాకు తెలియవచ్చింది. ఇప్పుడు మిమ్మల్ని ఏ కోర్టూ శిక్షించడానికి వీలులేదు. ఏమంటే, కోర్టులో నిలిచే సాక్ష్యమేమీ ఇప్పుడు దొరకదు కనుక. కానీ, మిమ్మల్ని ఇలా వదిలివేస్తే, ఇంకా ఎంత మందిని అంతమొందించి వేస్తారో, అందుచేత మేము ముగ్గురం-మిమ్మల్ని అంతమొందించడానికి ప్లానువేశాం.

"కాఫీకని పేరుపెట్టి పిలిచాం. కాఫీలో విషం కలిపి యిచ్చాము. దాని పేరేదో జ్ఞాపకంలేదుగాని, అది తిన్న పదినిమిషాలలో ప్రాణాలుపోతాయిట. మీకు యింకొక్కనిమిషం గడువుంది. ఈపాటికే మీ తలలోనూ, పొట్టలోనూ మంట ఆరంభమయి వుండాలి" అని ముగించాడు శర్మ.

"ఆఁ" అని డాక్టరు లేవబోయాడు గుండెలమీదనూ, పొట్టమీదనూ చెయ్యివేసి తడుముకోవడం ఆరంభించాడు కొంచెం సేపటిలోనే అతని మొహం నల్లబడింది. మొహంమీద ముచ్చెమటలు పోశాయి. కుర్చీలో వుండగానే అతని తల ముందుకువంగి గుండెలమీద వ్రేళ్లాడింది.

"అయిపోయింది" అన్నాడు శర్మ

"కేవలం భయంమూలాన అంత శీఘ్రంగా నిండుప్రాణం యెగిరిపోవడం నేను యిదివరకు యెప్పుడూ చూడలేదు" అన్నాడు రావు.

మూర్తి తల వెనక్కు తిప్పి "గుండె ఆగి చనిపోయాడని పోలీసులకి కబురు పంపించు" అన్నాడు.

